క్లుప్తంగా

వైష్ణవ ఆలయాల్లో నేడు ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉప్పాడలో వేంకటేశ్వర స్వామి, కొత్తపల్లిలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, రమణక్కపేటలో విజయ జనార్దనస్వామి, గోర్సలో సీతారామాలయం, నాగులాపల్లి, కొమరగిరి, ఎండపల్లి, కొండెవరం, మూలపేట, కొత్తమూలపేట, కోనపాపపేటలో ఉన్న వైష్ణవ ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించనున్నారు. స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

గోదా కల్యాణానికి ఏర్పాట్లు



కుంతీ మాధవస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

పిఠాపురం: మరో నాలుగు రోజుల్లో నిర్వహించనున్న భోగి పండగ సందర్భంగా వివిధ వైష్ణవాలయాల్లో గోదా కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 13న పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి, కొత్తపల్లిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 6 గంటల నుంచి గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ వైష్ణాలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరగనున్నాయి. వివిధ దేవాలయాల్లో సంక్రాంతి సందర్భంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



ఘటనా ప్రదేశంలో ఆయిల్ ట్యాంకర్, ద్విచక్రవాహనం

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటకు చెందిన వృద్ధుడు ఎలక్ట్రికల్ వాహనంపై కాకినాడ వెళ్తుండగా వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకినాడ– బిక్కవోలు కూడలి ప్రదేశంలో నెమ్మదిగా వెళ్తున్న ఆ ద్విచక్ర వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. దాంతో ఆ వాహనంపై ఉన్న కడియాల లచ్చారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విధుల నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రుడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పండగ కళ వచ్చేసింది..

- సంక్రాంతికి సర్వం సిద్ధం
- ప్రతి ఇంటా మురిపించేలా రంగవల్లులు



ఫోన్‌పే స్కానర్‌తో డూడూ బసవన్నలతో నిర్వాహకులు



పనసపాడులో ప్రారంభమైన కోడి పందేలు

సామర్లకోట: సంక్రాంతి సందడి మొదలైంది. నెల గంట ప్రారంభం నుంచి ప్రతి ఇంటా రంగవల్లులతో కళ వచ్చింది. ధనుర్మాసం ప్రారంభం నుంచి హరిదాసులు, డూడూ బసవన్నల సందడి నెలకొంది. సంక్రాంతిలో హరిదాసుకు ఒక ప్రత్యేకత ఉంది. హరిదాసు అక్షయ పాత్రలో బియ్యంతో పాటు డబ్బులు ఎంత వేస్తే అంతకు కొన్ని రెట్లు వస్తుందని భక్తుల నమ్మకం. దాంతో ఇంటి వద్దకు వచ్చిన హరిదాసుకు ఏదో ఒక విధంగా దక్షిణ వేయడం సంప్రదాయంగా వస్తోంది. అయితే భగవంతుని కీర్తనలతో గ్రామాల్లో తిరిగే హరిదాసుల కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఈ మేరకు మోటారు సైకిళ్లపై హరిదాసులు తిరుగుతున్నారు. ఈ హరిదాసులు ఫోన్‌పే స్కానర్లను కూడా వాడుతున్నారు. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మవారికి దండం పెట్టు అంటూ వచ్చే డూడూబసవన్నల నిర్వాహకులతో సందడి నెలకొంది.

కోడి పందేలకు బరులు సిద్ధం

సంకాంత్రి అనగానే గ్రామాల్లో కోడి పందేలు గుర్తుకొస్తాయి. సుమారు 50 ఏళ్ల కిందట కోడి పుంజులకు కత్తులు లేకుండా పందేలు నిర్వహించేవారు. పందెంలో పారిపోయిన కోడి ఓడిపోయినట్లు గుర్తించేవారు. కనుమ రోజున గెలుచుకున్న కోడి పుంజుతో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులు కలసి భోజనం చేసేవారు. ప్రస్తుతం పందెం కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వీకే రాయపురం, మాధవపట్నం, పనసపాడు, అచ్చంపేట, వేట్లపాలెం, మేడపాడు గ్రామాల్లో పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీ నాయకులదే హవా సాగుతోంది.

సొమ్ము లేక... కళ రాక

సంక్రాంతిని సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆనందంగా జరుపుకోవడం కష్టమవుతోంది. వరి కోత యంత్రాలతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయి. ఇసుక కొరతలో ఇళ్ల నిర్మాణ కూలీలకు ఉపాధి దూరం అయ్యింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పండగను ఎంతో ఆనందంగా జరుపుకొనే వారు. ప్రతి మూడు నెలలకు ఏదో ఒక రూపంలో ప్రజల వద్ద సొమ్ము ఉండేది. అమ్మఒడి, రైతు భరోసా, కాపు నేస్తం వంటి పథకాలతో సంక్రాంతికి చేతి నిండా సొమ్ము అందేది. దాంతో ఆనందంగా పండగలను జరుపుకొనే వారని పలువురు అంటున్నారు.

చేతిలో డబ్బులు లేక..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పండగలను ఆనందంగా జరుపుకోవచ్చని భావించాం. ప్రస్తుతం మా ఇద్దరు పిల్లలకు ప్రైవేట్ స్కూల్‌లో ఫీజులు చెల్లించాల్సి వచ్చింది. తల్లికి వందనం, ఫీజు రీయింబర్‌మెంట్ అమలు చేయలేదు. గతంలో చేయూత పథకంతో ఆసరాగా ఉండేది. పండగకు పిల్లలకు కొత్త దుస్తులు కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సి వస్తుంది.

– కర్రి వెంకటలక్ష్మి, సామర్లకోట

సందడే... సందడి

- సంక్రాంతికి గ్రామాల్లో ఏర్పాట్లు
- ముందే వచ్చిన పండగ శోభ



ఓ ఇంటి ముందు రంగవల్లి



పెద్దాపురంలో క్రీడా సంబరాలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మౌనిక

పిఠాపురం: భోగభాగ్యాల భోగి వచ్చేస్తోంది. ముచ్చటైన మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి పండగ మరో నాలుగు రోజుల్లో భోగి మంటలతో ప్రారంభం కానుంది. పండగలకు అన్ని గ్రామాల్లోనూ ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. భోగి మంటలు వేసేందుకు చిన్నారులు, పెద్దలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ఎక్కడ దుంగలు కనిపించినా మాయం చేసే పనిలో ఉన్నారు. గ్రామాల్లో సంక్రాంతి సందడి ఊపందుకుంది. డూడూ బసవన్నలు, హరిదాసుల సందడితో గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు అలరిస్తున్నాయి.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలనే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ టి.క్రాంతికుమార్ అన్నారు. స్థానిక మహరాణీ కళాశాల క్రీడా మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎస్సై వి.మౌనిక అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. అనంతరం విద్యార్థులకు సంప్రదాయ క్రీడలు కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్, రంగవల్లుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అలరించాయి. హెచ్‌ఎం యు.మీనామాధురి సంక్రాంతి ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ మేరకు బాలికలు వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంక్రాంతికి స్వాగతం చెప్పే భోగి మంటలను వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాటలు పాడుతూ డ్యాన్సులు చేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి

పిఠాపురం: తిరుమల స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం కోసం టోకెన్ల జారీలో భక్తుల తోపులాట కారణంగా ఆరుగురు మరణించడానికి బాధ్యత వహించి టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురంలో గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరుగురు మృతి, పలువురు గాయపడిన సంఘటన అత్యంత బాధాకరమన్నారు. స్వామివారి దర్శనానికి లక్షల మంది భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ.. టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. అధికార పార్టీ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సేవలో తరిస్తూ, సామాన్య భక్తుల మరణాలకు పరోక్షంగా కారణమైన టీటీడీ పాలక మండలిని రద్దు చేయాలని, చైర్మన్ వెంటనే తప్పుకోవాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. టోకెన్ల జారీ కేంద్రాల సమాచారం సరిగా లేదని, లక్షలాది మంది భక్తులకు తగిన ఏర్పాట్లు లేవన్నారు. భక్తుల భద్రత విషయంలో ఏమరపాటు తగదని ఇంకా దర్శనాలు ఆరంభం కాకుండానే ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలను టీటీడీ తరఫున ఆదుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఏ ఒక్క ప్రాణం పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మొత్తం టీటీడీ పాలకమండలి, ప్రభుత్వంపై ఉందన్నారు. వీఐపీల తాకిడి, సేవ తగ్గించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.

రాఘవమ్మ అందరికీ ఆదర్శం



రాఘవమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పెద్దాపురం: కుడుపూడి రాఘవమ్మను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్యకర్త ప్రజా పోరాటాల్లో భాగస్వాములు కావాలని సీపీఎం మండల కార్యదర్శి దారపు రెడ్డి క్రాంతికుమార్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో దారపు రెడ్డికృష్ణ అధ్యక్షతన గురువారం రాఘవమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణంలో ఆమె చేసిన కృషిని కొనియాడారు. సీపీఎం నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, సుబ్బలక్ష్మి, దారపురెడ్డి కృష్ణ, గడిగట్ల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదల పవన్ కళ్యాణ్ శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆయన పర్యటన నేపథ్యంలో గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి పరిశీలించారు. కుమారపురం గ్రామం కృష్ణుడి గుడి వద్ద యాతం నాగేశ్వరరావు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన మినీ గోకులం, పిఠాపురం పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ హైస్కూల్లో సభ వేదిక వద్ద స్టాల్స్, ఇతర ఏర్పాట్లను ఎంపీ, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.

ఇప్పుడేమి వాస్తు!



మార్పులు చేసిన వీకే రాయపురం పంచాయతీ కార్యాలయ భవనం

సామర్లకోట: ఆ పంచాయతీ ఏర్పడి మూడు దశాబ్దాలు దాటింది.. ఎందరో పాలకులు మారారు. ఇప్పుడు కొత్తగా వాస్తు దోషం వచ్చిందంట. అందుకే మార్పులు చేస్తుండడం శోచనీయం. మండలంలోని వీకే రాయపురం గ్రామ పంచాయతీకి 35 ఏళ్ల తరువాత వాస్తు గుర్తుకు వచ్చింది. పంతం పద్మనాభం దేవదాయ శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఈ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఉన్న పంచాయతీకి వాస్తుదోషం ఉందనే అనుమానాలతో గుమ్మాలను మార్పు చేస్తున్నారు. దీనికితోడు పంచాయతీ స్లాబ్ శిథిలం కావడంతో స్లాబ్ నిర్మాణంతో పాటు పంచాయతీ కార్యాలయం ప్రవేశ మార్గాలను మార్పు చేస్తున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావును వివరణ కోరగా ఈశాన్యంలో మరుగుదొడ్లు ఉండటం మంచిది కాదనే వాస్తు శాస్త్రవేత్తల సూచన మేరకు గుమ్మాలను మార్పు చేశామన్నారు. అదే విధంగా స్లాబ్ పెచ్చులు పడిపోవడంతో స్లాబ్ వేయించామని చెప్పారు. అయితే పాత భవనానికి పెట్టుబడి పెట్టే బదులుగా నూతన భవన నిర్మాణం చేయవచ్చు కాదా అని అనేకమంది అంటున్నారు.

అంత్యక్రియలు పూర్తి

కొత్తపల్లి: కృష్ణా జిల్లా పోరంకి శ్రీచైతన్య కళాశాల సరస్వతి భవన్‌లో నీట్‌కు శిక్షణ పొందుతున్న ఉప్పాడకు చెందిన విద్యార్థిని రామిశెట్టి గంగాభువనేశ్వరి అనుమానాస్పదంగా బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గురువారం రాత్రి ఉప్పాడ తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధనుర్మాసం దశమిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. స్వామివారి ఆలయం చుట్టూ ఉన్న ఉప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం భక్తులకు పులిహోర, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, భాస్కర్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



కలర్స్‌-2025ను ప్రారంభిస్తున్న యూనివర్సిటీ ప్రో చాన్సలర్

గండేపల్లి: రంగు రంగుల ఫ్యాషన్ వస్త్రాలంకరణలు, విద్యార్థులకు దీటుగా అధ్యాపకులు ఉత్సాహంగా గడిపేందుకు ఆదిత్య యూనివర్సిటీ వేదికగా నిలిచింది. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్ 2025 పేరిట నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యార్థుల నృత్యాలు, కేరింతలు, జెయింట్ వీల్, కొలంబస్, స్టాల్స్, వినోద భరితమైన సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుగానే సంక్రాంతి శోభను తలపించింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమం మొదటి రోజు యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్ సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జ్యోతి వెలిగించి బెలూన్స్ ఎగరవేసి యువజన ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల విరామానికి స్వస్తి పలికి విద్యార్థుల ఉత్సాహానికి వారి కోరిక మేరకు ఈ ఏడాది కలర్స్‌ను ప్రారంభించామన్నారు. స్పోర్ట్స్, గేమ్స్, సాంస్కృతిక విభాగాలలో పాల్గొనేందుకు 67 కళాశాలల నుంచి ఇప్పటికే 2,000 మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారన్నారు. సుమారు 50,000 మంది విద్యార్థులు పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది, సీసీ కెమెరాలు, టీమ్స్ పర్యవేక్షణ, రవాణా సౌకర్యాలు, భోజన వసతులు సమకూర్చినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో సినీ హీరో నిఖిల్ పాల్గొని సందడి చేశారు. జేఎన్టీయూకే రెక్టార్ కేవీ రమణారావు, ఐక్వ్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్ఎల్పీ ఫౌండర్, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, యూనవర్సిటీ ఉపకులపతి ఎంబీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గోదావరి కాలువలో దూకి వ్యక్తి గల్లంతు



సలీమ్ గోదావరి కాలువలోకి దూకినది ఈ వంతెనపై నుంచే



సలీమ్ (పాత చిత్రం)

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో దూకిన ఒక వ్యక్తి గల్లంతు అయిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం పెదపూడికి చెందిన షేక్ సలీమ్ (36) ఒక మహిళతో వచ్చి రైల్వే గేటు ఎదురుగా ఉన్న గోదావరి కాలువపై ఉన్న నూతన వంతెన నుంచి గోదావరి కాలువలోకి దూకాడు. ఆ సమయంలో సలీమ్‌తో వచ్చిన మహిళకు తన సెల్‌ఫోన్ అతను ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అదే సమయంలో పంచారామ క్షేత్రం నుంచి వస్తున్న కానిస్టేబుల్ విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాంతో సీఐ ఎ.దుర్గాప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. సలీమ్ గోదావరి కాలువలోకి దూకిన విషయాన్ని భార్య ఈశ్వరికి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనా ప్రదేశానికి చేరుకున్న ఈశ్వరి విషయం తెలిసి స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ట్రాఫిక్ ఎస్సై తన వాహనంలో ఈశ్వరిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ పెద్దాపురం మైనార్టీ సెల్ అధ్యక్షుడు జానీ మాట్లాడుతూ సలీమ్ ఒక లోకల్ పేపర్‌లో విలేకరిగా పని చేస్తున్నాడని చెప్పారు. ఈశ్వరి అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్నారు. అయితే ఎందుకు గోదావరి కాలువలోకి దూకాడో తెలియని చెప్పారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో సలీమ్‌తో వచ్చిన మహిళ చల్లగా జారుకుంది. సీఐ కృష్ణభగవాన్ గజ ఈతగాళ్ల సహాయంతో గోదావరి కాలువలో సలీమ్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

తుని: విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కోటనందూరు సెంటర్లో వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన మర్రిప్రోలు నాగేంద్రరెడ్డి, కుంచాల చిరంజీవి ప్రయాణిస్తున్న వాహనంలో 24.32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతంలో రూ.48 వేలతో గంజాయిని కొనుగోలు చేసి బాపట్లకు తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారన్నారు. కారు సీజ్ చేయడంతో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.నాలుగు వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటి నుంచి రోలర్ స్కేటింగ్ పోటీలు

అమలాపురం టౌన్: జిల్లా రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం బాలయోగి స్కేటింగ్ రింగ్‌లో ఈ నెల 11,12 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి 2వ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్–2025 పోటీలు జరుగుతాయని జిల్లా స్కేటింగ్ క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది. 5 నుంచి 17 సంవత్సరాల వయసు వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి జిల్లా నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని క్లబ్ తెలిపింది. అమలాపురానికి చెందిన హైదరాబాద్, విశాఖ మెట్రోకెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

గల్ఫ్‌లో బాధితురాలి ఆర్తనాదం

ఇండియాకు తీసుకురావాలని వేడుకోలు

పి.గన్నవరం: జీవనోపాధి నిమిత్తం బెహ్రాయిన్ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న ఓ మహిళ తనను స్వగ్రామానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. బెహ్రాయిన్‌లో ఆమె పని చేస్తున్న ఇంటి యజమానులు పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నానని, ఇండియాకు తిరిగి తీసుకురావడానికి ఏజెంట్లు రూ.లక్ష అడుగుతున్నారని రోదిస్తూ ఆమె నాలుగు రోజుల క్రితం వాట్సాప్‌లో పెట్టిన వీడియో వైరల్ అయ్యింది. వివరాలివీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన గుబ్బల వీర రాఘవులు భార్య కుమారి జీవనోపాధి నిమిత్తం గతంలో కువైట్ దేశానికి వెళ్లి, 20 ఏళ్ల పాటు పని చేసింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల కిందట కుమార్తె మరణించడంతో కుమారి స్వగ్రామానికి తిరిగి వచ్చి ఇక్కడే ఉండిపోయింది. నాలుగు నెలల క్రితం జిల్లాలోని రామచంద్రపురానికి చెందిన ఏజెంట్ వెంకటకృష్ణ, కాకినాడకు చెందిన కాశీ, లక్ష్మిల ద్వారా బెహ్రాయిన్ వెళ్లేందుకు ఆమె సిద్ధమైంది. డబ్బులు చెల్లించనవసరం లేకుండా బెహ్రాయిన్‌కు పంపిస్తామని, నెలకు రూ.30 వేల జీతం ఇస్తారని చెప్పిన ఏజెంట్లు.. తీరా ఎయిర్‌పోర్టుకు వెళ్లేసరికి రూ.లక్ష డిమాండ్ చేశారని ఆమె భర్త రాఘవులు గురువారం విలేకరులకు వివరించాడు. దీంతో గత్యంతరం లేక అప్పటికప్పుడు అప్పు చేసి రూ.లక్ష చెల్లించామన్నాడు. బెహ్రాయిన్‌లో నాలుగు నెలలు పని చేసినా తనకు జీతం ఇవ్వలేదని, ఇంటి యజమానులు నానా ఇబ్బందులూ పెడుతున్నారని, తిండి కూడా సరిగా పెట్టడం లేదని, నలుగురు వ్యక్తులు చేయాల్సిన పనిని తనతో చేయిస్తున్నారని రోదిస్తూ కుమారి చేసిన వాట్సాప్ వీడియో కాల్‌ను ఆమె భర్త రాఘవులు రికార్డు చేశాడు. వాట్సాప్‌లో పెట్టడంతో ఆ వీడియో కాస్తా వైరల్ అయ్యింది. తన భార్య అనారోగ్యంతో బాధ పడుతోందని, ఫిట్స్ కూడా వస్తున్నాయని భర్త వివరించాడు. ఆమెను ఇండియాకు తిరిగి తీసుకువచ్చేందుకు ఏజెంట్లు రూ.లక్ష ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పాడు. ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న తనకు అంత స్తోమత లేదని వివరించాడు. తన భార్యను క్షేమంగా ఇంటికి తీసుకు రావాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతూ రాఘవులు గత సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యవసాయ పనుల్లో బిజీబిజీ

● ఊపందుకున్న రబీ సాగు



నాట్లు పూర్తయిన వరి పొలం

పిఠాపురం: రబీ సాగు పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. సంక్రాంతి ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండడంతో వ్యవసాయ పనులకు మూడు రోజులు విరామం ఇవ్వనున్నారు. అయితే గత వారం రోజుల నుంచి పిఠాపురం నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే నూర్పిడులు, ధాన్యం అమ్మకాలు వంటి పనులు ఓ కొలిక్కి రావడంతో రబీ సాగు పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీ అయ్యారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పల్లపు భూములతోపాటు మెట్ట ప్రాంతం ఉంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో 40 వేల ఎకరాలు, చెరువుల కింద ఏడు వేల ఎకరాల్లో వరిని వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో వరి నారుమళ్లు పూర్తయ్యి నాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో నారుమళ్లు, నాట్లకు సిద్ధమయ్యారు. రబీ ఊడ్పులకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు 50 శాతానికి పైగా నాట్లకు నారు సిద్ధం చేశారు. దీంతో నారు సిద్ధమైన చోట నాట్లు వేసే పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఏలేరు, పీబీసీ శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి ఉండడంతో సాగు నీరు ఉన్న చోట్ల రైతులు నాట్లు వేస్తున్నారు. ఈ నెలాఖరుకు 90 శాతానికి పైగా నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ అత్యవసర, ప్రత్యేక సమావేశాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. గత నెలలో వాయిదా పడిన నాలుగు అంశాలతో అత్యవసర సమావేశం ఉంటుందన్నారు. అనంతరం ప్రత్యేక సమావేశంలో 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంచనా బడ్జెట్లపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

పిఠాపురం: స్థానిక అగ్రహారంలో అనఘా దత్తక్షేత్ర ఆడిటోరియంలో జనవరి 11న నిర్వహించనున్న హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ పిలుపునిచ్చింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆహ్వాన కమిటీ మెంబర్ డేరా రాజబాబు పిఠాపురంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత సవాళ్లు ఎదురవుతున్న పరిస్థితుల్లో హైందవ ఉపాధ్యాయులని జాగృతి చేయడం కోసం ఈ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు.

ట్రయాంగిల్ యాప్‌పై అవగాహన

పిఠాపురం: స్థానిక పురపాలక సంఘ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ హోం ట్రయాంగిల్ యాప్‌పై గురువారం మెప్మా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ 100 మంది సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తామని జిల్లా టీఈ మార్కెటింగ్ మంగాదేవి, జిల్లా ఐబీ కె.మోహన్‌కుమార్ తెలిపారు.

రేషన్ కోసం ముప్పతిప్పలు



23వ వార్డుకు చెందిన రేషన్ షాపు వద్ద వినియోగదారుల బారులు

సామర్లకోట: స్థానిక 11వ సచివాలయంలోని రేషన్‌దారుల కష్టాలు తీర్చే నాథుడు కనిపించడం లేదు. సచివాలయం పరిధి 22, 23 వార్డులకు చెందిన లబ్ధిదారులకు మూడు నెలలుగా ఎండీయూ వాహనాల నుంచి సరకులు అందడం లేదు. దాంతో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆయా ప్రాంతాల సమీపంలోని రేషన్ డీలర్లకు సరకులు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు రేషన్ షాపులకు వేలి ముద్రలు వేసే డివైజ్ ఒకటే ఉండటంతో అందరికీ సరకులు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 23వ వార్డులోని సత్యనారాయణపురం ప్రజల కష్టాలు వర్ణనాతీతం అయ్యాయి. ఇక్కడి రేషన్ షాపునకు సంబంధించి జయలక్ష్మి థియేటర్ సమీపంలోని రేషన్ షాపు నుంచి సరకులు తీసుకోవాల్సి వస్తుంది. సత్యనారాయణపురం, అప్పయ్యచెరువు, మాజేటినగర్ ప్రాంతాలకు చెందిన వారు ఈ రేషన్ షాపునకు వచ్చి సరకులు తీసుకోవాల్సి ఉంది. ఆయా ప్రాంతాల నుంచి రేషన్ షాపునకు వచ్చే దారిలో ఒక వైపు బార్, మరో వైపు రోడ్డులో బ్రాందీ షాపు ఉండటంతో మందుబాబులతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా తమ సమస్యను పరిష్కరించడం లేదని రేషన్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనం వచ్చే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. 11వ సచివాలయానికి వచ్చే ఎండీయూ వాహన నిర్వాహకుడిపై ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

సుజుకీ వారి బంపర్ ఆఫర్స్

అమలాపురం టౌన్: సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది.

సంతాన సాఫల్యం సులభతరం



జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనియాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణరెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

విస్తృత వైద్య సేవల్లో ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 2019 నుంచి వైద్య సేవలను అందిస్తూ, ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. ఆసుపత్రి ఆర్థోపెడిక్, రుమటాలజీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి వైద్య సేవల్లో ప్రత్యేకత కలిగి ఉంది. ఈ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ తొలి గుర్తింపు పొందిన ఆర్థోపెడిక్ రుమటాలజిస్ట్ డాక్టర్ జి.సురేష్. ఆయన లక్నోలోని రామ్ మనోహర్ లోహియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థోపెడిక్ రుమటాలజీ, రీజెనరేటివ్ ఆర్థ్రోబయాలజిక్స్‌లో ఫెలోషిప్ పొందారు. ఆయన రూపకల్పన చేసిన ప్రొలోజోన్, అగ్మెంటెడ్ ప్రొలోజోన్ ట్రీట్మెంట్స్ ఆస్టియోఆర్థిటిస్ మోకాళ్ల చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. డాక్టర్ సురేష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పురస్కారాలను అందుకున్నారు. డాక్టర్ మంజుషా సాలాడి, ఆసుపత్రి మేనేజింగ్ పార్టనర్, గైనకాలజీ, ప్రసూతి విభాగానికి అధిపతిగా ఉన్నారు. మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలు, హై-రిస్క్ ప్రెగ్నెన్సీలను విజయవంతంగా నిర్వహించడంలో ఆమె అనుభవజ్ఞురాలు. ఎంఎస్ ఆసుపత్రి స్థాయి-2 ఐసీయూ సేవలను ప్రారంభించి ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. ఈ ఆసుపత్రి అనేక క్లిష్టమైన వైద్య కేసులను విజయవంతంగా పరిష్కరించి, ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు.

ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గౌరవప్రదం



యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

కొత్తపల్లి: సమాజంలో ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, సభ్యులంతా కలసి కట్టుగా ఉంటేనే సంఘాలు బలపడతాయని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ అన్నారు. పొన్నాడ శివారు బషీర్‌బీబీ (బంగారుపాప) దర్గా సమీపంలో గురువారం మండల ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సమాకూర్చేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. మండల యూనియన్ అధ్యక్షుడు పిట్ల శ్రీను, సెక్రటరీ నాగు, ట్రెజరర్ షద్రక్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంసీ ఆస్పత్రి చరిత్ర ఎంతో ఘనం

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో 120 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తోన్న సీఎంసీ హాస్పటల్ ఎంతో ఘన చరిత్ర కలిగి ఉంది. అనుభవం కలిగిన డాక్టర్ల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరికరాలతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నామని సీఎంసీ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అమృతలాల్ తెలిపారు. స్త్రీల వైద్య, ప్రసూతి సేవలు, కంటి వైద్య సేవలు, ఎముకలు, ఊపిరితిత్తులు, చర్మ, గుండె, నరాల వ్యాధులతో వస్తోన్న రోగులకు అనుభవం కలిగిన వైద్యులతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. లేప్రో స్కోపిక్ ద్వారా కోత లేకుండా ఆపరేషన్ చేస్తున్నట్టు డాక్టర్ అమృత్‌లాల్ పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో వైద్యసేవల కోసం వచ్చేవారికి అందుబాటులో రుచి శుభ్రతతో కూడిన ఆహారం అందించే కేంటిన్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు.